



# ఈ కథకు ముగింపు లేదు

అర్ధి

'భానుమూర్తి ఈ ఊళ్ళోనే ఉన్నాడు...!' అన్నాడు మూర్తి అందమైన చైనా పింగాణీతో చేసిన మగ్‌లోకి మరికొంచెం సోడా ఒంపుకుంటూ. మసగ్గా వెల్గుతున్న నియాన్‌బల్బ్ కాంతిలో— రాజా ముఖంలో ఉలిక్కిపడిన చారలు స్పష్టంగా తేలివయ్.

'ఏమిటా నువ్వనేది...? ఏ భానుమూర్తి?' ముఖంలోని భావాలు కనపడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తూ అన్నాడు.

'ఓహ్... ఏ భానుమూర్తో చెప్పనే లేదు కదూ—!' పెళ్ళున నవ్వుతూ, 'నీకు ఎందరు భానుమూర్తులు తెలుసో నాకు తెలియదు కాని, నీకూ, నాకూ తెలిసిన భానుమూర్తి ఒకే ఒక వ్యక్తి. అయినా చూడా... నేను భానుమూర్తిని కాదు — మూర్తి నన్న సంగతి మర్చిపో రాస్కెల్...!' అన్నాడు గ్లాస్ ఖాళీచేస్తూ, తీవ్రంగా.

హోటల్ ద్వారకా ఏర్‌కండిషన్డ్ హాల్‌లో, నియాన్‌లైట్ల వెలుగులో, ఎక్కడినుండో పాశ్చాత్య సంగీతం మంద్రంగా వినిపిస్తోంది. సంగీతానికి అనుగుణంగా లయబద్ధంగా అడుగులు వేస్తూ, శరీరం ఒంపుసొంపుల్ని అతి చాకచక్యంగా ప్రదర్శిస్తూ, ప్రేక్షకుల్ని మైమరపిస్తోంది, స్ట్రిప్ — డాన్స్ ఛాలెంజర్ మార్గరెట్ ... ఓ మూలగా రాజా, మూర్తులు కూర్చున్నారు. గ్లాసుల సవ్వడి, సోడా కలుపుతుంటే వచ్చే శబ్దాలూ తప్ప, వాళ్ళిద్దరి మధ్యా మాటల్లేవు ఓ ఐదు నిముషాల పాటు...

'ట్రైనుకు టైమవుతోంది... వెళ్తానిక...!' అన్నాడు రాజా రోజ్ ఉడ్ బల్ల మీద మాపుడు వేలితో పిచ్చి గీతలు గీస్తూ...

'అదేం? ఇవ్వాళా, రేపూ నా అతిథిగా ఉండేందుకు అంగీకరించావుగా. ఐనా భానుమూర్తిని చూడవూ?' ముద్దగా ఉంది మూర్తి కంఠం.

'లేదు లేరా! నాకొంచెం అర్జంట్ పని ఉంది. మరోసారెప్పుడైనా వస్తాను...!' అన్నాడు లేచేందుకు ప్రయత్నిస్తూ.

'స్టే వేర్యూ ఆర్...నువ్వు నా ఆతిధ్యం అంగీకరించినా, అంగీకరించక పోయినా— వెల్...ఐ డోంట్ బాదర్ మచ్...బట్... యు షుడ్ సీ భానుమూర్తి...!' కోపంతో పిడికిలి బిగిస్తూ అనాడు మూర్తి.

ఇప్పుడు నాకా అవసరమూ అవకాశమూ రెండూ లేవు...!' లేని గాంభీర్యాన్ని ప్రదర్శించాలనే విఫలయత్నం చేస్తూ అన్నాడు.

'ఏమిటన్నావ్? అవసరం లేదూ? అసలు నీకో అవసరమంటూ ఏదైనా ఒకటేడిస్తే. అది ఆరేళ్ళ నాడే తీరి ఉండాలి. కాని చూడు— ప్రస్తుతం ఆ అవసరం నాకుంది...' ఆఖరు బొట్టును మగ్‌లోకి ఒంచుతూ, 'బేరర్... ఒక విస్కీ...ఆఁ... ఏమిటి చెపుతున్నాను? అవకాశం లేదంటావా? నేను కల్పిస్తానోయ్...?' అన్నాడు కుర్చీలో వెనక్కు వాలి.

'బెదిరిస్తున్నావా?'

'ఛ ... ఛ ... ఛ ... బెదిరింపు లేనిటోయ్...? బెదిరింపులూ, బెల్లింపులూ నీలాంటి పిరికి వెధవల లక్షణం ... వో

విషయం తెలుసా నీకు? ఆవేదన గుండె అవధులు దాటినపుడు. నేను అన్నిటికంటే ఈజీగా చేయగలి పని ఇలా విస్కీ తాగడం ఒక్కటే. కాని, అంతకంటే ఈజీగా ఈ పళాన నిన్ను 'మర్డర్' చెయ్యగలను కూడా. పైగా నీలాగా నాకు వెనకా, ముందూ కూడా ఎవరూ లేరు. అది సరేగాని, ఆ కథేమిటో చెప్పు...'

'నాకే కథా తెలియదు... ఏది ఏమైనా మొత్తానికి 'రచయిత' బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు.!' వో పెగ్‌తో బాటిల్ వోపెన్ చేస్తూ తేలిగ్గా నవ్వేందుకు ప్రయత్నిస్తూ అన్నాడు రాజా.

'వెల్ సెడ్ మై బాయ్...వెల్ సెడ్... రచయితను కనకనే, ఆరేళ్ళ నుండీ సశేషంగా నడుస్తున్న ఈ కథను పూర్తి చేసేందుకే నువ్వు భానుమూర్తిని చూసి తీరాలనేది...!' కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా మండుతున్నాయ్... మొహం మీద వాలుతున్న జుట్టును చిరాగ్గా వెనక్కి తోస్తూ,

'మాట్లాడవేం? పోనీ నేనే చెప్తాను విను. ఆరేళ్ళ క్రితం — సరిగ్గా గుర్తు చేసుకో — వైజాగ్‌లో — డాల్ఫిన్స్ నోస్ దగ్గర — లలిత నడత మంచిది కాదనీ, కావాలంటే ప్రూవ్ చేస్తానని భానుమూర్తితో అన్నావు...'

'అది కాదు మూర్తీ...!'

'షటప్...మధ్యలో నోరెత్తావంటే నీ రక్తం కళ్ళ చూస్తాను. నేను నీలాంటి మిత్రద్రోహిని కాదురా స్కౌండ్రల్...లలితను వాడెంతగా ప్రేమించిందీ నీకంటే నాకు ఎక్కువ తెలుసు. నువ్వు చెప్పిన 'స్కాండల్స్' విని, మానసికంగా కొంతవరకూ దెబ్బతిన్న మాట నిజమే కాని, మొదటి నుండీ స్త్రీ పట్ల వాడికున్న ఉదాత్తమైన భావాలూ, శీలం పేరిట, కేవలం పురుషుడి విషయంలో అశ్లీలంగా భావించబడక పోయినా, పైగా అదో పెద్ద గొప్ప విషయంగా లెక్కించే ఈ కుష్టు వ్యవస్థ, ఆడదానికి అనాదిగా చేస్తున్న అన్యాయాల్ని ప్రతిఘటించి తీరాలనే ఆశయాలూ, ఆదర్శాలు అప్పట్లో లలితను పెళ్లాడేట్లు చేశాయి'...!' మాట్లాడటం ఆపి సిగరెట్ కేస్ నుండి తనో సిగరెట్ తీసుకుని రాజాకు ఆఫర్ చేశాడు.

'— నీ పథకం పారక పోవడంతో నీలోని రాక్షసుడు రోజు రోజుకూ ప్రాణం పోసుకున్నాడు — అందుకే, ఆ రాత్రి భానుమూర్తిని కావాలని డిన్నర్‌కు ఆహ్వానించావు. ఈలోగా, నీలాంటి మరో బ్యాచ్‌తో మంతనాలాడి, అందంగా వో కాకమ్మ కథ అల్లి, భానుమూర్తి మీ యింటికి వచ్చే సమయానికి, మీరు ఈ విషయాలు మాట్లాడుకుంటున్నారు. భానుమూర్తికి వినపడేలా...! తను నమ్మిన ఆశయాల కోసం, వాటిని నిరూపించాలనే తహతహతో, జీవితం మీదా, భవిష్యత్తు మీదా పందెం కాసి లలితను పెళ్ళాడినా, ఆ దెబ్బతో, తనే ఓడిపోయాననే బాధ గుండెల్ని దహిస్తుంటే, అవమానంతో-క్రుంగిపోయాడు... నువ్వాశించిన ఫలితం దొరికింది నీకు. ఔనా?'

'హాఁ...అబద్ధం...! లోకంలో అసలు నిజమనే పదం ఒకటేడ్చిందని నీకు తెలియదు గనక అంతా అబద్ధాల పుట్టగానే కన్పిస్తుంది. ఐనా ఏది అబద్ధం-? నువ్వు అలా చెప్పిన మాట అబద్ధమా? లేక 'చెప్పిన మాటలు' అబద్ధాలా? ఏదిరా అబద్ధం...! ఆ మసగ వెలుగులో రాజా ముఖాన్ని చీరేసేట్టుగా చూస్తున్నాడు మూర్తి.

'... ... ...'

'సరే...ఆరేళ్లనాడు నువ్వు ఈ కథకు నాంది పలికిన మాటే అబద్ధమనుకుందాం, ఇప్పుడు 'నిజమేవి'టో నేన్నిరూపిస్తాను' అంటూ షర్ట్ జేబులో నుండి కొన్ని ఫోటోలు తీసి రాజా ముందుకు విసిరాడు...

'ఈ ఫోటోలు నేనూ నిర్మలా కలిసి తీయించుకున్నవి — ఐ మీన్ — 'సెల్ఫ్ ఎరేంజ్‌మెంట్'తో మేమే తీసుకున్నవి. నిజమేమిటో బాగా చూడు...!' అంటూ కుర్చీలో నుండి లేచి దగ్గరలో ఉన్న టేబుల్‌లైట్ స్విచ్ ఆన్ చేశాడు.

రాజా కళ్ళ ముందు మెరుపు మెరిసినట్లయింది. ఔను — నిర్మల...తన చెల్లెలు నిర్మలే...దాంపు అన్నీ అస్వాభావికమైన రూపాలే...రాజా గుండెలు భయంతో గుబగుబలాడాయ్. నరాలు ఉబ్బి మొహమంతా ఎర్రగా కందిపోయింది.

'మూర్తీ...! ఏమిటిదంతా? నిర్మలకూ, ఆరేళ్ళ నాటి ఆ సంఘటనకూ సంబంధమేమిటి?' వణుకుతున్న కంఠంతో అడిగాడు రాజా.

'ఏమిటా? 'నిజం' ఎలా ఉంటుందో చూపిస్తున్నాను...ఈ ఫోటోలేవిటన్నావు కదూ—? నీ చిన్నారి చెల్లి నాతో తిరిగిన తిరుగుళ్ళకి నిదర్శనాలు. నీ పరిభాషలో చెప్పాలంటే చె...డు...తి...గు...ళ్ళు...' ఒత్తి పలుకుతూ.

'మూర్తీ...!' గట్టిగా అరిచాడు రాజా ఆవేశంతో పైకిలేస్తూ.

'ఎందుకలా గొంతు చించుకుంటావ్? కథింకా 'క్లైమాక్స్'కు రాలేదు భాయ్... ఇంకా ఉంది విను ... బహుశా నిర్మలా, నువ్వు కూడా ఇంతకాలం నేను తనను పెళ్లి చేసుకుంటాననే అనుకుంటూ ఉండవచ్చు ... ఇంకా — 'నన్యాయం చెయ్యకండి...! పైగా ఇప్పుడు నేను......కూడా కాదు' అని ప్రాధేయపడుతూ, కాళ్ళావేళ్ళా పడేందుకు రేపో మాపో నా దగ్గరకు రావచ్చేమో కూడా-!' మధ్యలో వో నిముషం మరో గుక్క తాగుతూ, 'అప్పుడు నేనేమన్నాని రాజా—? ఇదంతా అ...బ...ద్ధం...! నీకూ, నాకూ ఏ సంబంధం లేదు. గెటవుట్ అని కదూ అనాల్సింది...!'

రాజా మొహం తెల్లగా పాలిపోయింది. ఎయిర్ కండీషన్డ్ హాల్‌లో కూడా చెమటతో చొక్కా అంతా తడిసి పోయింది. కళ్ళలో శూన్యత... వో నిముషం వరకూ మళ్ళీ వాళ్ళ మధ్య మాటల్లేవు.

'ఇప్పుడు నన్నేం చేయమంటావు మూర్తీ...!' బాధతో కళ్ళు మూసుకుని అడిగాడు.

మూర్తి వాచీ చూసుకుంటూ, 'అదేదో తర్వాత చెప్తాను. ఇప్పుడే — పదకొండు ఐంది. నువ్వు భానుమూర్తిని చూడాలి పద !' అంటూ వరండా వైపు నడిచాడు.

కారు కెన్నెడీ రోడ్డును మింగుతూ, టి.బి. హాస్పిటల్ వైపు పరుగుతీస్తోంది.

'రాజా...ఇప్పటివరకూ నాలోని మంచితనాన్నే చూసిన నీకు ఇప్పుడు నా ప్రవర్తన ఆశ్చర్యాన్నీ, అసహ్యాన్నీ కలిగించవచ్చు. కాని బ్రదర్...ఇలాంటి విషయాల్లో నేను చాలా చెడ్డవాణ్ని సుమా...! కేవలం నీలోని జలసీ వల్ల ఆ నాడు నువ్వు సృష్టించిన స్కాండల్స్ వల్ల ఈనాడు రెండు జీవితాల నాశనానికి దారి తీసింది. మర్చాను

ఏమ్చేయాలో చెప్పనే లేదు కదూ-! ఏం లేదు—నవ్వన్నావే—అదే—అబద్ధమని—అలా నువ్వు చెప్పిన మాట అబద్ధం కాదన్న నిజం నీకూ తెలుసు. కాని—అలా అప్పుడు చెప్పిన 'మాటలూ', మీ ఇంట్లో ఆ రాత్రి జరిగిన సంఘటనా—ఇవన్నీ నిజం కాదన్న నిజాన్ని కనీసం ఇప్పుడైనా భానుమూర్తికి చెప్పి, ఇప్పటికైనా ముగిసినవి నిరూపించుకో...! లేదంటావా ... తెలుసుగా ... నిర్మల...!'

'తెలిసింది మూర్తి...!' భారంగా, బరువుగా ఉన్నాయి రాజా మాటలు.

హాస్పిటల్ గేటుదాటి పోర్టికోలో ఆగింది కారు. రాజాకేం అర్థం కాలేదు.

'మూర్తి... భానుమూర్తికి...!' రాజా కంఠంలో ఆతృత తొంగి చూస్తోంది.

'మాట్లాడకుండా నా వెంట నడువు'

## ఈ కథకు ముగింపు లేదు

కటువుగా అన్నాడు మూర్తి.

ఎమర్జెన్సీ వార్డులో, బెడ్ నంబర్ 13 దగ్గర డాక్టర్లూ, నర్సులూ గుమిగూడి ఉన్నారు...ఆ వాతావరణాన్ని చూస్తూనే మూర్తి గుమ్మంలోనే స్తంభించి పోయాడు. ఎదురుగా వస్తున్న డాక్టర్ని అడిగాడు ఆందోళనతో అయామ్ సారీ...విపరీతమైన రక్తం పోయింది — హి ఈజ్ డెడ్... 'హి ఈజ్ డెడ్...హి ఈజ్ డెడ్ ..' పదే పదే ఆ మాటలు ప్రతిధ్వనిస్తున్నాయ్ మూర్తి చెవుల్లో.

'ఎస్...హి ఈజ్ డెడ్... మన భానుమూర్తి చచ్చిపోయాడ్రటా రాజా...ఇట్స్ నాచురల్ ... నథింగ్ బట్ నాచురల్ ... కదూ రాజా...!' వణుకుతున్న కంఠంతో అన్నాడు. మాటల్లో నవ్వు తిరుగుతున్న వ్యథ ధ్వనిస్తోంది.

'మూర్తి...వెంటనే లలితను పిలిపిస్తే బావుంటుంది కదూ...' బాధగా అన్నాడు రాజా.

'బావుంటుందిరా—చాలా చాలా బావుంటుంది. కాని ఎలా? ఎక్కడుందని పిలిపించను? నాకైతే స్వర్గంలో ఉండి ఉంటుందన్న నమ్మకం ఉందికాని — నువ్వన్న చెడునడత పాపఫలంగా నరకానికి వెళ్ళి ఉంటుందని ఓ క్షణం ముందువరకూ. ఈ ఆరేళ్ళనుండీ బాధపడుతూనే ఉన్నాడు భానుమూర్తి. మరి ఎక్కడినుండని పిలిపించనా...!' ఎంత అణచుకున్నా మూర్తికి దుఃఖం ఆగటలేదు.

'అయామ్ సారీ మూర్తి ... నన్ను క్షమించు!'

'క్షమా... ? దేనికి రాజా ? అయినా నేనెవర్ని క్షమించేందుకు. క్షమించగలిగిన వాళ్ళిద్దరూ లేరిప్పుడు. ఐనా చూడు రాజా—! క్షమించేందుకూ, పశ్చాత్తాపమే పాపపరిహారమని సరిపెట్టుకునేందుకూ ఇది సినిమాగానీ, నవలగానీ కాదు. ఇదే జీవితం మోయ్ ... ఇందాక అన్నాను గుర్తుందా— రచయితను కనకనే, ఈ ఆరేళ్ళ నశేష కథనూ ఈనాటితో పూర్తి చెయ్యాలని కాని ఈ కథ పూర్తికాదని తేలిపోయింది రాజా—! పాత్రలైతే తమపని ముగించుకుని వెళ్ళిపోయాయికాని — కథకు మాత్రం ముగింపు దొరకడం లేదురా...! ఈ కథిలా చరిత్ర సరిహద్దులవరకూ సాగిపోవాల్సిందే! చివరగా ఒకమాట రాజా...! ఒక కథకు ముగింపు పలికేందుకు నిర్మల విషయంలో కొంత కల్పనే చెప్పాను. కాని, ఈ పన్నాగ ఆధారంగా, ఈలాంటి మరో కథ ప్రారంభం కాకూడదు మళ్ళీ ఈ క్షణంనుండి- ! అందుకే, వీలైనంత త్వరలో నిర్మలను పెళ్ళిచేసుకుంటాను ... !' కొనగోటితో కన్నీళ్ళను విదిలిస్తూ, వెనక్కు తిరిగి చీకటిలోకి నడుస్తూ అన్నాడు మూర్తి. ●

22—6—73

